


స్విమ్స్‌లో మత ప్రాతిపదికన లెక్చరర్ పోస్టుల భర్తీ
ప్రకటనను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్విమ్స్ ఆసుపత్రిలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రేడియాలజికల్ ఫిజిక్స్ (మెడికల్ ఫిజిక్స్) 4 లెక్చరర్ ఉద్యోగాలకు యాజమాన్యం తరపున రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో హిందూ మతస్థులు మాత్రమే ఉద్యోగాలకు అర్హులని పేర్కొనడం రాజ్యాంగ వ్యతిరేక చర్యగా సిపిఎం భావిస్తోంది. టిటిడి ఆలయ వ్యవహారాలు, పూజాదికాలలో మతం అంశం పరిగణలో ఉండాలని, పరిపాలన వ్యవస్థలోనూ, విద్య, వైద్య, ట్రాన్స్ పోర్ట్ తదితర రంగాలలో మతం పేరిట వివక్ష చూపటం సమంజసం కాదని, తక్షణం ఈ రాజ్యాంగ వ్యతిరేక ప్రకటనను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రతిభ ప్రాతిపదికన వ్యక్తులను పక్కనపెట్టి మతాన్ని ముందుకు తీసుకు రావడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.



75 కేజీల బస్తా రూ.1600లే..

దళారుల 'పంట' పండింది..!

ఏటేటా.. ఇదే 'వర్రీ'..!

ఆరుగాలం కష్టపడే అన్నదాతకు కష్టాలు కూస్తంత దూరంలోనే ఉంటాయి.. గత ఏడాది 75 కేజీల బస్తా రూ.2100 పలికితే అన్నదాతలు ఎంతో సంతోషించారు. అయితే ఈ ఏడాది అదే బస్తా రూ.1600 పలుకుతోంది.. దళారులు దాదాపు రూ.500 తగ్గించేశారు.. అన్నదాతలు వరి పంటను నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో దళారులు పంట పండింది.. రూ.1600 పలుకుతున్న 75 కేజీల బస్తాను పెద్దమొత్తంలో కొనుగోలు చేసి, నిల్వ చేసి, రెండు మూడు నెలల తరువాత సొమ్ము చేసుకునేందుకు దళారులు సమాయత్తం అవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పైరుతు కష్టాలతో కాపురం చేస్తుంటే, దళారులు మాత్రం పెద్దమొత్తంలో బస్తాలను కొనుగోలు చేసి, లక్షలతో జేబులు నింపుకుంటున్నారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా తూర్పు మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్



శ్రీకాళహస్తి మండల పరిధిలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. 12,500 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఏడాది వివిధ వర్షాలు పడడంతో 12వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. కొన్ని పంచాయతీల్లో ముందస్తుగా నాట్లు నాటడంతో పంటలు పండి కోతలు పూర్తయ్యాయి. అయితే వాతావరణ ప్రభావంతో అన్నదాతకు నిరాశే మిగిల్చింది. ఒక ఎకరా భూమిలో వరి పండించాలంటే దాదాపు రూ.30వేల రూపాయలు పెట్టుబడులు పెట్టాల్సిందే. కొన్ని పంచాయతీల్లో ముందస్తుగా కెఎన్ఎం 1638 రకం ధాన్యాన్ని పండించారు. గత ఏడాది ఇదే రకం ఎకరాకు 75 కేజీల బస్తాలు 30 నుంచి 35 వరకూ దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఇదే రకం 20-25 బస్తాలే పండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఈ రకం 75 కేజీల బస్తా దాదాపు 2000-2100 రూపాయలు పలికింది. ఈ ఏడాది 1600కు కొనడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదే అదనుగా భావించిన దళారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తూ రైతులను మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ లాభంతో రైస్ మిల్లులకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి రైతుల పంట లాభసాటిగా ఉండేలా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది : సుధాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

మండలంలో కొన్ని పంచాయతీల్లో ముందస్తుగా నాట్లు నాటారు. ఆ పంట ఇప్పుడు దిగుబడి వచ్చింది. పూర్తిస్థాయిలో పంటలు మండలమంతా రాలేదు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుంది. ఎక్కువ మండలాల్లో పంట చేతికి ఇంకా రాలేదు. మొత్తం పంట చేతికి వచ్చిన తరువాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

నాసిరకం విత్తనాలతో లబోదిబో

ప్రజాశక్తి - ఏర్పేడు

ఓ వైపు కొన్ని పంచాయతీల్లో ధర గిట్టుబాటు కాక నష్టానికి వరి పంట అమ్ముకుంటుంటే, ఏర్పేడు మండలంలో నాశిరకం విత్తనాలతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్క చిందేపల్లి గ్రామంలోనే 400 ఎకరాల వరి పంట నష్టపోయామని రైతులు చెబుతున్నారు. ఏర్పేడు మొదలు వెంకటగిరి రోడ్డు చుట్టుపక్కల గ్రామాలు, పంగూరు చుట్టుపక్కల చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్ని రైతులు వాపోతున్నారు. రేణిగుంట మండలం ఆర్.మల్లవరానికి చెందిన ఓ ప్రైవేట్ విక్రయదారుడు దగ్గర 25 కేజీల వరి విత్తనాల బ్యాగు రూ.1200 నుండి రూ.1300చొప్పున 2024, నవంబర్‌లో కొనుగోలు చేశారు. పంట వేసిన తరువాత వరి కంకి సరిగ్గా రాకపోవడం, వచ్చినా మొత్తం జల్లుగింజలు వచ్చాయని విక్రయదారున్ని రైతులు నిలదీశారు. నాశిరకం విత్తనాలు అమ్మిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎకరాకు రూ.40వేల రూపాయలు నష్టపరిహారాన్ని రైతులకు చెల్లించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రంగయ్య డిమాండ్ చేశారు. ఆయకట్టు ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరెడ్డి రైతుల పంట పొలాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



నకిలీ విత్తనాలపై నిలదీస్తున్న రంగయ్య



పాఠశాలలో డార్విన్ సిద్ధాంతంపై అవగాహన

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన పెంచుకోవాలి

ప్రజాశక్తి - రేణిగుంట

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనతో ముందుకెళ్లాలని ఉపాధ్యాయులు మోహన్, లావణ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా సహాయ కార్యదర్శి ఒ.వెంకటరమణ అన్నారు. రేణిగుంట బాలుర, బాలికల పాఠశాలలో బుధవారం 'డార్విన్ జయంతి ఉత్సవం' జరిగింది. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం అంకితభావంతో నిర్విరామంగా కృషి చేశారన్నారు. శాస్త్రీయ ఆలోచనలు పెంచుకుని, పట్టుదలతో చదివి శాస్త్రవేత్తలు కావాలన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని కనుక్కున తర్వాతే జీవశాస్త్రంలో పెనుమార్పులు సంభవించాయన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీవారి భక్తులకు టిటిడి విజ్ఞప్తి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనానికి టోకెన్లు, టికెట్లు పొందిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లలోకి ప్రవేశించాల్సిందిగా టిటిడి విజ్ఞప్తి చేసింది. ఇదే విషయాన్ని పలుమార్లు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా భక్తులకు తెలియజేశాం. అయినప్పటికీ ఇటీవల కొంత మంది భక్తులు తమకు కేటాయించిన సమయానికి ముందే క్యూలైన్ల వద్దకు వెళ్లి క్యూలైన్లలోకి అనుమతించాలని సిబ్బందితో వాగ్వాదానికి దిగడమేకాకుండా, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని పేర్కొంది. శ్రీవారి దర్శన టోకెన్లు పొందిన భక్తులు వారికి కేటాయించిన సమయానికి మాత్రమే క్యూలైన్లలోకి ప్రవేశించాలని టిటిడి కోరుతోంది.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ నాని

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పగడ్బందీగా నిర్వహించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. మహా శివరాత్రి ఉత్సవాలపై బుధవారం తలకోనలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఐదు రోజులు పాటు జరగబోవు మహాశివరాత్రి ఉత్సవాలు రద్దీ ని దష్టిలో పెట్టుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కోనేరు నిర్మాణం పై అటవీ శాఖ, రెవెన్యూ, ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవో మమత పాల్గొన్నారు.

రేపు గిరిజన భవన్‌లో 'షికారీల సమ్మేళనం'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఈనెల 14వ తేదీ బైరాగిపట్టెడలోని గిరిజన భవన్ వేదికగా నక్కల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ ఆదిమ మహాసంగ్ ముఖ్య సలహాదారు మల్లి సుబ్బారావు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో షికారీలను ఆయా ప్రాంత వాడుక భాషలలో పిలవడం జరుగుతోందని, షికారులకు అందవలసిన ప్రభుత్వ పథకాలు, రేషన్ కార్డులు, క్యాస్ట్ సర్టిఫికెట్లు, విద్య, వంటివి అందడం లేదన్నారు. తాము ప్రత్యేకమైన గుర్తింపు కోసం పోరాడుతున్నామన్నారు. ఈ నక్కల సమ్మేళన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుండి వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు దాదాపు 350 మంది హాజరవుతున్నారన్నారు. నక్కల సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ్ శంకర్, వేల్మురుగన్, దీప కుమార్ పాల్గొన్నారు.

'వైసిపి సపోర్టుతోనే నాపై నిందలు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గత ఐదు రోజులుగా తనపై నిందారోపణలు చేస్తున్న లక్ష్మీరెడ్డి వైసీపీ ట్రాప్ లో పడిందని, ఆమె విడుదల చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేయడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని జనసేన నాయకుడు కిరణ్ రాయల్ ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ క్రైమ్ కేసులో గతంలో తిరుచానూరు పోలీస్ స్టేషన్లో లక్ష్మీరెడ్డిని తప్పించింది అభినయ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. ఒక మహిళను నాపై ప్రయోగించి నా పరువు తీయడానికి కుట్ర జరుగుతుందని 2023లోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పానన్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసినప్పుడు పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తానని చెప్పారన్నారు. నాకు నామినేటెడ్ పోస్టు రాకుండా చేయడానికి నా పరువు తీయడానికి లక్ష్మీరెడ్డిని ముందు ఉంచి వైసిపి నాయకులు కథ నడిపించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని చేసినా తాను జనసేన పార్టీకి వీర విధేయుడుగా పని చేస్తానని, తన పరువుకు భంగం కలిగించే పనులు చేస్తున్న వారిని జైల్లో పెట్టిస్తానని హెచ్చరించారు. వీడియోలను, ఫోటోలను మార్ఫింగ్ చేసి ప్రచారం చేయడంపై కోర్టును ఆశ్రయిస్తున్నానన్నారు. అయితే కిరణ్‌రాయల్ బాధితురాలు లక్ష్మిరెడ్డికి జైపూర్ కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది.

హాస్టళ్ల మరమ్మతుకు అంచనాలు పంపండి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వసతి గృహాల మరమ్మతులకు సంబంధించి అంచనాల ప్రతిపాదనలను శనివారం లోపు పూర్తిస్థాయిలో పంపాలని, శాఖాపరమైన నిధులకు అదనంగా అవసరమైన నిధులను సిఎస్ఆర్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎంపి లాడ్స్ తదితర వాటిని వినియోగిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీ ఈడబ్ల్యుఐడీసీ బాల సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణ, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రేష్మ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత పాల్గొన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం 27 శాతం నుండి 47 శాతానికి పెంచి రిజర్వేషన్లు అమలు చేయాలని ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లోని బీసీ బూర్జువా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు మేల్కొని 2025 సంవత్సరం నడుస్తున్న 1990లో ఉన్న ఓబీసీల జనాభా నిష్పత్తి ప్రకారం నిర్ణయించిన 27 శాతం రిజర్వేషన్లను అమలు చేయడం సిగ్గుచేటు అన్నారు. బీసీల్లో ఉన్న పేదకులాలను ఓబీసీ జాబితాలో చేర్చడానికి తాము వ్యతిరేకం కాదని అయితే దీనికి ముందు ఎప్పుడో నిర్ణయించిన ఓబీసీ 27 శాతం రిజర్వేషన్లను 47 శాతానికి పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఓబిసి విద్యార్థి సంఘం నాయకులు విజయ్ ఉత్తరాది, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇదెక్కడి చోద్యం..!

ఎన్నికలకు ఓకే... పార్టీలోకి 'నాట్' ఓకే..!

వైసిపి కార్పొరేటర్లను 'వాడేస్తున్న' కూటమి

మేయర్ అవిశ్వాస తీర్మానం తరువాతైనా..?

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'డిప్యూటీ మేయర్‌గా ఒకే ఒక్కడుగా ఉన్న టిడిపి కార్పొరేటర్‌ను గెలిపించుకోడానికి మీ సహాయ సహకారాలు కావాలి.. అయితే కూటమి పార్టీల్లోకి చేరడానికి మాత్రం ఇంకా సమయం ఉంది.. ఇపుడే కాదు.. అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ మాట్లాడుకుని ఓ నిర్ణయానికి వచ్చిన తరువాతే మిమ్మల్ని పార్టీలోకి తీసుకుంటాం.. అప్పటివరకూ వేచి ఉండాల్సిందే..' అంటున్న కూటమి నేతల వ్యూహం ఏంటో వైసిపి కార్పొరేటర్లకు అర్థం కాని పరిస్థితి. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో మా సహాయం తీసుకోడానికి లేని అభ్యంతరం, మమ్మల్ని పార్టీలోకి చేర్చుకోవడానికి ఏంటి? అంటూ మధనపడుతున్నారు.



పార్టీ వైసిపి... ఓటు మాత్రం కూటమికి... (ఫైల్‌ఫొటో)

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి కార్పొరేటర్లు టిడిపి, జనసేన పార్టీల్లో చేరాలని తొమ్మిది నెలల క్రితమే ప్రయత్నం చేశారు. అయితే కూటమి నేతలు వైసిపి కార్పొరేటర్లను తమ పార్టీల్లో చేర్చుకోడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. పలుమార్లు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులును, టిడిపి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. అయితే అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదన్న సమాధానమే వారికి వినిపిస్తోంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టిడిపి ఒకే ఒక్క కార్పొరేటర్‌ను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో వైసిపి కార్పొరేటర్లకు ప్రలోభాలు ఎరచూపి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో గెలుపొందారు. ఎన్నికల్లో మొత్తం 48 మంది ఎంఎల్ఎ, ఎంపితో సహా ఓటింగ్ నిర్వహించారు. 26 మంది టిడిపికి ఓటేయగా, వైసిపికి 21 మంది మాత్రమే ఓట్లు వేశారు. టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందారు. టిడిపికి ఓటు వేసిన వైసిపి కార్పొరేటర్లు అందరూ అదేరోజు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఓ ప్రైవేట్ హోటల్లో కలిసి డిన్నర్ చేశారు. ఆ విందులో వైసిపి కార్పొరేటర్లు తమను ఎపుడు పార్టీలో చేర్చుకుంటారని మంత్రిని అడిగారు. అయితే మంత్రి మాత్రం అధిష్టానం నుంచి త్వరలో పిలుపు వస్తుందని, అపుడే పార్టీలో చేరాలని సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. చాలాచోట్ల వైసిపి కార్పొరేటర్లను టిడిపి, జనసేన పార్టీల్లో చేర్చుకున్నారు. అయితే తిరుపతిలో మాత్రం ఎందుకు నాన్చుతున్నారన్నది వైసిపి కార్పొరేటర్లకు అర్థం కాని పరిస్థితి. ఎన్నికలపుడు తమను వాడేస్తూ, కండువా కప్పేందుకు మాత్రం దూరంగా ఉంచడం ఏంటన్నది వారి అంతర్మథనం. వైసిపి పార్టీలో గెలిచిన డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఇప్పటికే కూటమి కండువా కప్పుకునేందుకు అనేక ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే.

త్వరలోనే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

తిరుపతి కార్పొరేషన్ మేయర్ పదవిని కైవసం చేసుకుని కూటమి జెండా ఎగురవేయాలన్నది 'అధికార' వ్యూహం. వచ్చే నెలతో మేయర్ డిప్యూటీ శిరీష పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కానుంది. మేయర్ ఎన్నికల వరకూ వైసిపి కార్పొరేటర్లను వాడుకోవాలని కూటమి భావిస్తోంది. అప్పటివరకూ వారిని పార్టీలో చేర్చుకునే ప్రసక్తి లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కూటమి పార్టీలో మేయర్ అభ్యర్థిగా డాక్టర్ అన్న అనిత యాదవ్ ముందు రేసులో ఉన్నారు. అయితే నేతలు ఎవరి పేరు ప్రకటిస్తారో వేచి చూడాల్సిందే. ఇటు వైసిపి అధిష్టానం కూడా మేయర్ పదవి కూటమికి వెళ్లకుండా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. వైసిపి కార్పొరేటర్లను చేర్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇష్టం లేకపోయినా, కేవలం టిడిపి జెండా కార్పొరేషన్ ఎగరవేయాలన్న ఉద్దేశ్యంతోనే వారిని వాడేస్తున్నారన్నది డిప్యూటీ మేయర్ ఎన్నికలపుడే అర్థమైపోయింది. వైసిపి కార్పొరేటర్లపై అనేక ఆరోపణలు ఉండటం, ఒకవేళ పార్టీ కండువా కప్పితే మేయర్ అభ్యర్థికి పోటీ పెరుగుతుందన్న ఆలోచనతోనే వారిని తీసుకోడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం. ఏదిఏమైనా డిప్యూటీ మేయర్ ఎన్నికలకు వాడేసినట్లే, మేయర్ అవిశ్వాస తీర్మానంలోనూ ఫుల్‌గా వాడేసే పరిస్థితి ఉంది.


సిఎంఎ ఫలితాల్లో 'ఎమరాల్డ్స్' ప్రభంజనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



కొలకత్తా లోని ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ వారు విడుదల చేసిన సీఎంఏ ఇంటర్ ఫలితాలలో తిరుపతి నగర పరిధిలోని నరసింహతీర్థం రోడ్డు మార్గంలో గల ఎమరాల్డ్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి ప్రభంజనం సష్టించారని ఎమరాల్డ్స్ డైరెక్టర్లు ఇ. గిరిధర్, కె. విశ్వనాథ్ తెలిపారు. ఈ ఇంటర్ కోర్స్ ఫలితాలలో 61.34 శాతం ఉత్తీర్ణతను సాధించామన్నారు. పి. నికిత్ 476, ఎస్. సౌమ్య 432, ఆర్.గణేష్ 430, పి.కుసుమ 420, ఎం.సాయితేజ 405, కె.కీర్తి 400, కె.ద్వారకనాథ రెడ్డి 400, సి.ఎ.హర్షిత 400 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బందాన్ని డైరెక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.

ఐఐటి జెఇఇ మెయిన్స్‌లో అమరావతి అకాడమి ప్రతిభ



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఎ) మంగళవారం విడుదల చేసిన జెఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో తిరుపతిలోని అమరావతి ఐఐటి అకాడమీ (కష్ణారెడ్డి బి.వి.కే. గ్రూప్) లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బి.అరుణ్ కుమార్ రెడ్డి 99.938, వి కేయూస్ సాయి 99.42, వై మనీష్ 98.98, కె సాయి సంతోష్ 98.50, జే లక్ష్మీ మాధురి 97.54, టి వంశీకష్ణ 97.54, శ్రీ కీర్తన రెడ్డి 97.46, టి మానస్ కుమార్ 97.46, వి.కార్తిక్ శివ తేజ 97.23, జి.లాశ్య 97.03 పర్సంటేజ్ సాధించారు. జాతీయస్థాయిలో 95 శాతం పైగా 50 మంది విద్యార్థులు పరసెంటైల్ సాధించారని100 మందికి పైగా విద్యార్థినీ,విద్యార్థులు 90 శాతం సాధించారని చైర్మెన్ బి వి కష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

15న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక విక్రమ్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 15వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పట్టాభి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుళ జాతీయ కంపెనీలైన గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, అల్ట్రా మెరైన్ పిగ్మెంట్స్, డోరా, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, బీటెక్ పూర్తిచేసిన యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు అని సూచించారు. విద్యా అర్హత సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డులను తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 7989509540, 8919889609 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.



ఎంపీడీవో కార్యాలయం..
వరాహాల విహార కేంద్రం...

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయం వరాహాలకు విహార కేంద్రంగా మారింది. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వరాహాలు అక్కడ స్వైర విహారం చేస్తున్నాయి. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోనే వెలుగు, ఉపాధి హామీ, ఐసిడిఎస్, ఫారెస్ట్, వ్యవసాయ, విద్య, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖా కార్యాలయాలు ఉన్నాయి. అయితే వరాహాల సమూహం ఎప్పుడు పడితే అప్పుడు, కార్యాలయాల పనివేళల్లో సైతం అతిధుల్లా విహరిస్తుండడంతో సిబ్బంది, పలు సమస్యలపై వచ్చే అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా వరాహాలను ప్రజా ఆరోగ్య భద్రతా చట్టం కింద పట్టణ, మండల కేంద్రాలకు కనీసం 10 కిలోమీటర్ల అవతల ఉంచాలన్న నిబంధన ఉంది. అయితే అవేమి అధికారులు పట్టించుకోకపోవడంతో వరాహాలు ప్రభుత్వ కార్యాలయాలను విడిది కేంద్రాలుగా వినియోగించుకుంటున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.



వేద వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా పోకల భాస్కర్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్‌గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మ్యాథమెటిక్ ప్రొఫెసర్ ఆచార్య పోకల భాస్కరును టిటిడి నియమించింది. బుధవారం ఆయన పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య తారకరామకుమార శర్మ నుంచి భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదేవుని అనుగ్రహం వలన తనకు ఈ భాగ్యం దక్కిందని, విశ్వవిద్యాలయం అభివద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తానని, తనకు ఈ అవకాశం కల్పించిన తితిదే అధికారులకు, ఉప కులపతులకు కతజ్ఞతలు తెలిపారు. ఎస్.వి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఎస్.జి.ఎస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ , కోదండరామస్వామి స్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేంద్రబాబు అభినందనలు తెలిపారు.



నల్లరిబ్బన్లతో మౌన నిరసన


ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వ విద్యాలయంలో నిరవధిక సమ్మె 10వ రోజుకు, రిలే నిరాహారదీక్ష ఆరోరోజుకు చేరింది. స్టైఫండ్ పెంపుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో పశువైద్య విద్యార్థులు నల్లరిబ్బన్లు ధరించి మౌన నిరసన తెలిపారు. మాజీ పశు సంవర్ధక శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు ఇచ్చిన హామీనే నెరవేర్చమని కోరుతున్నామని, పెరిగిన ధరలకు అనుగుణంగా స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు.

రైల్వేబోర్డు చైర్మన్‌ను కలిసిన తిరుపతి ఎంపి

తిరుపతి టౌన్ : తిరుపతి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలపై భారత రైల్వే బోర్డు చైర్మన్, సిఇఒ సతీష్‌కుమార్‌ను తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి కలిశారు. వెండోడు, నాయుడుపేట, సూళ్లూరుపేట స్టేషన్లలో కోవిడ్ సమయంలో కొన్ని రైళ్లకు స్టాపింగ్ తీసేశారని, వాటిని పునరుద్దరించాలని కోరారు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ తూర్పు వైపు టికెట్ బుకింగ్ కౌంటర్ ప్రారంభించినా, ఇప్పటివరకూ టికెట్లను జారీ చేయలేదన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎల్‌సి 160 రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉందన్నారు. తడ మండలంలోని పెరివేడి వద్ద ఉన్న ఎల్‌సి గేట్ నంబర్ 41 అండర్‌పాస్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. మెమో రైలు సర్వీసులను నాయుడుపేట వరకూ పొడించాలన్నారు.

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఢిల్లీలోని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన పాఠశాల విద్యా విభాగ కార్యదర్శిని ఎంపి కలిసారు. గ్రామీణ, పేదరికంలో ఉన్న విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించవచ్చన్నారు.



రహదారి పనులు ప్రారంభించండి

కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే వినతి



కేంద్ర మంత్రి గడ్కరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని ఢిల్లీలో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నా యన్నారు. నగరి నియోజక వర్గంలో జాతీ య రహదారుల విస్తరణ పనులు మొదలు పెట్టాలని, నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన మంత్రిని కోరారు.

తిరుపాల్ కుటుంబానికి పరామర్శ



తిరుపాల్‌ను పరామర్శిస్తున్న వైసిపి మండల అధ్యక్షుడు మణినాయుడు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తలారివెట్టుకు చెందిన వైసిపి నాయకులు తిరుపాల్ తండ్రి లోకయ్య కర్మ క్రియలు బుధవారం నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షులు కె.మణి నాయుడు ఈ కార్యక్రమానికి హాజరై కుటుంబా నికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మనో ధైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ఆర్టీఐ వింగ్ అధ్యక్షులు రవీంద్ర రెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఉగ్గుమూడి గురునాథం, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య, సంజీవయ్య, జయచంద్ర నాయుడు, కోటేశ్వరరావు, తలారివెట్టు సర్పంచ్ ప్రసాద్, కుప్పయ్య, మునికృష్ణయ్య , శ్రీధర్ రమేష్, యూత్ నాయకులు కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎంవిఎస్‌నాయుడు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైతులు సాగుకు ముందు భూసార పరీక్షలు చేసుకొని అధిక దిగుబడు లు పొంద వచ్చని ఎస్‌వి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎంవీఎస్ నాయుడు తెలిపారు. పుత్తూరు మండలం తణుకులో పంట బుధవారం ఆయన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకుని అనుకున్న పంటలు సాగు చేసుకుని అధిక దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ఎరువులు, విత్తనా లు.వినియోగిం చుకుంటే మంచి దిగుబడి పొందవచ్చని సూచించారు. అనంతరం మండలంలోని పరమేశ్వర మండలం నంది మండలం, నేసనూరు, కేబీఆర్ పురంలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఏడిఏ రమేష్ రాజు, ఏవో కోదండయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది లావణ్య, తరుణ్ కుమార్, మురళి మోహన్, దయాన్ పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి: ఎంఈవో

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ముని సబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని కనమనంబేడు పాఠశాల, బుచ్చిరాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. తాజా కూరగాయలు, ఆకుకూరలతో భోజనం వండాలని, మెనూ బోర్డులను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజనంలోని లోటుపాటులను వంటల వారికి వివరించారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి: డిఎల్‌పివో



ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలను పరిశీలిస్తున్న డిఎల్‌పివో

ప్రజాశక్తి -పెళ్లకూరు: మండలంలో ఏర్పాటు చేసిన చెత్తనుండి సంపద సేకరణ కేంద్రాలు అన్నింటిని విని యోగంలోకి తేవాలని డిఎల్‌పివో సిహెచ్ రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలంలో సూళ్లూరుపేట డిఎల్‌పివో సిహెచ్ రవీంద్రబాబు బుధవారం తాల్వాయి పాడు, శిరసనం బేడు గ్రామాలలో చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుచూ మండలంలో 20 చెత్త నుండి సంపద కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపిసి) ఉన్నాయని అవన్నీ సక్రమంగా పనిచేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి తడి చెత్త , పొడి చెత్తను వేరు చేసి తద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయాలని , ఇలా చేయడం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండి పరిసరాల అపరిశుభ్రత వల్ల వచ్చే వ్యాధులను నివారించడమే కాకుండా సంపద సృష్టించవచ్చని తద్వారా గ్రామాలు సస్య రక్షణ వైపు పురోగమిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, తాల్వాయిపాడు సర్పంచ్ భర్త వీరకుమార్, ఎస్ డబ్ల్యూ పిసి వాచ్ ఉమెన్ అముదమ్మ ఉన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రండి..

కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే ఆహ్వానం



కేంద్ర మంత్రికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో అంగరంగ వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు రావాలని కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు. ఎమ్మెల్యే బొజ్జల బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌ను కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, ముక్కంటి తీర్థ ప్రసాదాలు అందించారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండలంలో ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య వచ్చేందుకు రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ప్రతి పౌరునికి ఆధారుకార్డు వలే ప్రతి రైతుకూ గుర్తింపు నెంబర్లతో కూడిన యూనిక్ కోడ్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పని సరిగా ఈ రైతు సంఖ్యను పొందాలని పుత్తూరు మండల వ్యవసాయ అధికారి కోదండయ్య తెలిపారు. నందిమంగళం ,ఉత్తరపు కండ్రిగ, శిరుగు రాజ పాలెంలో రైతులకు బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేసుకుని కోడ్ నెంబరు పొందితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో పురోగతి సాధించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : న్యాయ వ్యవస్థలో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. నేషనల్ లా స్టూడెంట్ అసోసియేషన్ (ఎన్ఎల్ఎస్ఎ) జాతీయ అధ్యక్షుడు పి సుందరరాజు అధ్యక్షతన ఢిల్లీలో నగరంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆఫీస్ నందు నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ మోహన్, ముఖేష్, రవితేజ, పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు నూతన భవనం ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న బ్యాంకు జీఎం పాండురంగ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కరకంబాడి కెనరా బ్యాంకు నూతన భవనాన్ని కెనరా బ్యాంకు సర్కిల్ ఆఫీసు తిరుపతి జనరల్ మేనేజర్ పాండురంగ మిత్తంతాయ బుధవారం ప్రారంభించారు. పాత భవనం నుండి నూతన భవనంలోకి కెనరా బ్యాంకు కరకంబాడి శాఖను మార్చి, వినియోగదారులకు మంచి సౌకర్యవంతమైన సేవలను అందించ డానికి తగిన ఏర్పాట్లను చేశామన్నారు. కెనరా బ్యాంక్ రీజనల్ ఆఫీసు ఏజీఎం నాగరాజరావు మాట్లాడుతూ బ్యాంకుల అభివృద్ధిలో ఖాతాదారుల ప్రాముఖ్యత, ఖాతాదారులకు సులభ పద్ధతిలో రుణ సదుపాయాలు వంటి అంశాలను వివరించారు. ఈ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి రీజనల్ ఆఫీస్ డిఎంలు శరవణ కుమార్, సువర్ణ కృష్ణ, హర్ష, బ్యాంకు సీనియర్ మేనేజర్ సిద్దయ్య, మేనేజర్ భాస్కర్, ఏఈఓ నళిని పాల్గొన్నారు.

చనిపోయినా మరొకరికి చూపు..

మహిళ కళ్లు దానం



ధృవీకరణ పత్రం అందుకుంటున్న దాత కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఓ మహిళ మృతి చెందినా తన కళ్ళ మరొకరికి దానం చేసి చూపు నిచ్చి ఈ ప్రపంచాన్ని చూస్తోంది. ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆసుపత్రిలో ఎం లీలావతి (61) చియపాడు కడప ప్రాంతానికి చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు లీలావతి, కొడుకు సిద్దారెడ్డి తన తల్లి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. రుయా కంటి విభాగం విభాగాధిపతి డాక్టర్ దలపతి రెడ్డి ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి నేత్ర విభాగ, నేత్ర నిధి బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా నేత్ర విభాగ అధిపతి డాక్టర్ దలపతి రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో మృతి చెందిన వారు, తన తదనంతరం అవయవ దానాలు, నేత్ర దానాలకు ముందుకు రావడం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో నేత్రాలను సేకరిస్తున్నామని తెలిపారు. రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులు, ఈ విధంగా ప్రభుత్వ వైద్యశాలలకు నేత్రాలు, అవయవాలు దానం చేయడం వల్ల పేద రోగులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఈ అవయవాలను వారికి ఉచితంగా అమర్చడానికి ఇలాంటి అవయవ దానాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎవరైనా ప్రజలు ఎవరైనా నేత్ర దానం చేయాలంటే 8500880126 ఫోన్ నెంబర్ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ వి ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎస్ రమేష్, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మ్యాన్ మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన లైన్‌మ్యాన్ ఆనందరెడ్డి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: విధి నిర్వహణలో వున్న లైన్‌మ్యాన్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని బోడేవాండ్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని ఉస్తికాయలపెంట పంచాయతీ దేవావాండ్లపల్లికి చెందిన ఆనంద్ రెడ్డి (40) విద్యుత్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఓఎస్ గొల్లపల్లి దేవర వాండ్లపల్లి సబ్ స్టేషన్లో బుధవారం (ట్రాన్స్‌ఫార్మర్) మరమ్మతు పనుల్లో నిమగ్న మయ్యారు. ప్రమాద వశాత్తు ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు వున్నారు. ఆయన మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి, శోకసంద్రంలో మునిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

సిబ్బందికి తహశీల్దారు ఆదేశం



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న తహశీల్దారు వెంకటరమణ

ప్రజాశక్తి -రామచంద్రపురం: గ్రామాల్లో ప్రజలు, రైతులు వివిధ ప్రజా సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సులలో ఇచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పరిష్కరించాలని తహశీల్దారు కె వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తమ సిబ్బందితో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను గ్రామాలలో, క్షేత్ర స్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని, అర్జీదారులకు పరిష్కార నివేదికను కూడా (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) అందించాలని ఆదేశించారు. గ్రామాలలో 17 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 234 ఫిర్యాదులు అందాయని, అందులో 102 సమస్యలు పరిష్కరించామని ఆయన తెలిపారు. అనంతరం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ సిసోడియా వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతను పాటించి గడువు లోపు పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. వినతుల పరిష్కా రంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రిన్సిపల్ సెక్రెటరీ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూములకు సంబంధించిన మ్యుటేషన్, దరఖాస్తులను ప్రతిపాదన పూర్తి ప్రతిపాదనలని ఆదేశించారు. వివిధ కార్పొరేషన్ రుణాలు కోసం, కులము, ఆదాయం, ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే ధృవపత్రా లు మంజూరు చేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాలలో ప్రజలకు అందుబాటులో వుండి సమస్యలు పరిష్కరిం చాలన్నారు. భూ సమగ్ర సర్వే, దరఖాస్తులు, రీ హోల్డ్ ను సమగ్రంగా చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు అనర్ బాష, ఆర్ ఐ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ ఎస్ రమేష్ బాబు, వీఆర్వోలు రాజశేఖర్, ప్రదీప్ నాయుడు, నరసింహులు, వెంకటరమణ, బాబు, యూన్స్ రాణి, మల్లికార్జునరెడ్డి, గుణ భూషణ్ నాయుడు, సచివాలయ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జేఈఈలో అశ్వమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అశ్వమేధ కళాశాల ప్రిన్సిపాల్ సుమతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి ఎంఆర్ పల్లిలోని అశ్వమేధ జూనియర్ కాలేజీ విద్యార్థులు మంగళవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఎ) విడుదల చేసిన జేఈఈ మెయిన్2025 ఫేస్- 1 ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటా రని ఆ కళాశాల డైరెక్టర్స్ అబ్దుల్ ఇశ్రత్, టిఎమ్ గోవర్ధన్ బుధవారం తెలిపారు. అత్యధిక పర్సంటైల్స్ సాధించిన విద్యార్థులు మొత్తం 156 మంది విద్యార్థులకు పి నిఖిల్ 99.3, వెంకట సాయి 98.7, పర్సంటైల్, కే.యశ శ్రీ 98.5 పర్సంటైల్, వెంకట రెడ్డి 98.3 పర్సంటైల్, వి.మోక్షిత 92.4 పర్సంటైల్, శ్రీ వైష్ణవి 92.1 పర్సంటైల్స్ ను సాధించారని తెలిపారు.అత్యధిక విద్యా ప్రమాణాలతో తమ సంస్థ విద్యార్థులను మంచి ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్స్ సుమతి, రామయ్య,అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

జేఈఈలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఎన్‌టిఎ గత నెల 21వతేదీ నుంచి నిర్వహిం చిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితా లలో శ్రీ చైత న్య విద్యార్థు లు అత్యుత్త మ ప్రతిభ కనబరిచి, టాప్ పర్సంటైల్ సాధించా రని కళాశాల ఏజీఎమ్ బీవీ ప్రసాద్ తెలిపారు. ఇందులో అభిరామ్, ఓఎమ్ శర్మ 99.8 పర్సెంటైల్ సాధించ గా, జీవన్ కుమార్ 99.2,నిఖిల్ 99.0, మంజునాథ్ 98.7,ప్రియాతమ్ 98.6, సీవీ వరుణ్ తేజ్ 98.2, మనోజ్ కుమార్ 98.2 పర్సెం టైల్ సా ది. ం చి విజయదుదుంబి వెూగించారాని హర్షం వ్యక్తం చేశా రు. అధ్యా ప కుల కృషి, కళాశాల పటిష్ట ప్రణాళికతోనే విద్యార్థులు విజయం సాధించారన్నారు.

వైభవంగా మాఘ పౌర్ణమి గరుడ సేవ



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం మాఘ మాస పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 నుండి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుడునిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు గ్రంథ రచనపై లేఖకులకు కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు వివిధ భారతీయ భాషలలో హైయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్స్ లో వివిధ సబ్జెక్ట్స్‌కు సంబంధించిన అంశాలను 22 భాషలలో అనువదించి, పుస్తక రచన చేయడం లక్ష్యంగా ఈ కార్యశాలను నిర్వహించనున్నారు. ఈ కార్యశాల యుజిసి, భారతీయ భాషా సమితి, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13, 14 తేదీలలో నిర్వహిస్తున్నారని విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జియస్ఆర్ కృష్ణమూర్తి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్ గా ప్రొఫెసర్ ఎ.సచ్చిదానందమూర్తి, అడిషనల్ కో-ఆర్డినేటర్‌గా డా.ఎ.శేఖర్ రెడ్డి వ్యవహరించనున్నారు.

వేడుకగా శ్రీ రామకృష్ణ తీర్థ ముక్కోటి



శ్రీ రామకృష్ణ తీర్థ ముక్కోటికి విచ్చేసిన భక్తులు


ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శేషాచల అడవుల్లోని పుణ్యతీర్థాల్లో ఒకటైన శ్రీ రామకృష్ణతీర్థ ముక్కోటి బుధవారం వేడుకగా నిర్వహించారు. ప్రతిఏటా మాఘ మాసంలో పౌర్ణమినాడు శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. శ్రీరామకృష్ణ మహర్షి తపోబలంతో ఈ పుణ్యతీర్థాన్ని సృష్టించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది మంత్రోచ్ఛారణ చేసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరి ఉదయం 11 గంటలకు శ్రీ రామకృష్ణ తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణభగవా నుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. రామకృష్ణ తీర్థానికి వెళ్లే భక్తులకు పాపవినాశనం డ్యామ్ వద్ద పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర పొట్లాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను శ్రీవారి సేవకులు పంపిణీ చేశారు. తీర్థం వద్ద టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి భక్తులకు మందులు పంపిణీ చేశారు. టీటీడీ ఇంజినీరింగ్, అటవీ విభాగాల ఆధ్వర్యంలో మార్గమధ్యంలో పలుచోట్ల భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా నడకమార్గాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలపై సబ్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఇటీవల వచ్చిన రైతుల అర్జీలపై గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ బుధవారం క్షుణ్ణంగా ఆరా తీశారు. కోట మండలంలో రెవెన్యూ అధికారులు బుధవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, స్థానిక తహశీల్దారు కార్యాలయానికి వచ్చారు. రెవెన్యూ అధికారులు తో సమావేశం ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు ఎన్ని? అనే కోణంలో విఆర్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని అర్జీలకు ఎన్ని పరిష్కారం చేశారు? ఎన్ని పరిష్కరించాలనేది వాటి వివరాలను విఆర్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఆయా అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చేయాలనీ పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కోట తహశీల్దార్ కటారి జయ జయ రావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆచార్య పీవీ రామ్మూర్తి మృతి

ఎస్వీయు మనో విజ్ఞాన శాస్త్ర వ్యవస్థాపకులు



ఆచార్య పివి రామ్మూర్తి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయు మనోవిజ్ఞాన శాస్త్ర వ్యవస్థాపక సభ్యుడు, ఎన్‌సిఓపి సభ్యుడు, విశ్రాంత ఆచార్యులు పివి రామమూర్తి (88) మంగళవారం బెంగళూరులో ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆచార్య రామ్మూర్తి మృతి పట్ల వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ఆయన శిష్యులు, మాజీ ఉపకులపతులు ఆచార్య జమున, ఆచార్య శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అండ్ మీడియా కోఆర్డినేటర్ డాక్టరు పాకనాటి హరికృష్ణ, ఆచార్య లలిత తదితరులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మృతి వృద్ధాప్య పరిశోధనలకు తీవ్ర లోటు అన్నారు. ఈయన సతీమణి ఆచార్య సుజాత రామ్మూర్తి ఎస్వీయూ హోమ్ సైన్స్ విభాగం ఆచార్యులుగా పని చేశారు. వీరికి ఒక కుమార్తె అమెరికాలో వృత్తిరీత్యా నివసిస్తున్నారు. ఆచార్య రామ్మూర్తి వృద్ధాప్యంపై భారతదేశంలో జెరో-సైకాలజీ (వృద్ధుల సైకాలజీ) రంగంలో మొదటి పిహెచ్‌డి సాధించి, జెరో-సైకాలజీ పరిశోధ నలో అగ్రగామిగా నిలిచారు. భారతదేశంలో వృద్ధాప్యం గురించి బోధించడం ప్రారంభించిన ఘనత ఆయనది. వర్సిటీలో వృద్ధాప్యం పై 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఏజింగ్' అనే పరిశోధక సంస్థలు ప్రారం భించి వృద్ధాప్యంపై పరిశోధనలతో భారత్ - యుఎస్ఎ సంయుక్త ఫుల్ బ్రైట్ ఫెలోగా లాస్ ఏంజిల్స్‌లోని ఆండ్రస్ జెరో నెటాలజీ సెంటర్‌లో పరిశోధనలు చేశారు. అమెరికా ప్రభుత్వ "ఎజెండా ఫర్ రీసెర్చ్ ఆన్ ఏజింగ్" అనే సంస్థ సభ్యుడిగా పని చేశారు. వృద్ధాప్య రంగంలో సుమారు 150 పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. ఆచార్య రామ్మూర్తి వృద్ధాప్య రంగంలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, గౌరవాలు ఆయన అందుకున్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టరు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి నుండి వరదయ్యపాలెం మండలం సంతవేలూరుకు ప్రసాద్ (35), అతని భార్య వెన్నెల (30) కలిసి సంత వెల్లూరులో బంధువుల ఇంటికి బుధవారం ఉదయ ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మండలంలోని పార్లపల్లి వైన్ షాప్‌ను సమీపిస్తుండగా మెయిన్ రోడ్‌లో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో భార్యాభర్తలు రోడ్డుపై పడ్డారు. భర్త ప్రసాద్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. భార్య వెన్నెలకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ విశ్వనాథ నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: కుటుంబ గొడవల కారణంగా ఓ భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర నగర్ లో బుధవారం చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భవన నిర్మాణ కార్మికుడు పనిచేసే గోపి (45) లింగేశ్వరనగర్లో కాపురం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన గోపి భార్యతో గొడవ పడడంతో, భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరి జీవితాన్ని భరించలేక గోపి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజులుగా ఇంటి తలుపులు తీయకపోవడంతో, ఇంటి నుండి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చూడడంతో గోపి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు

రూ.25 లక్షల ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తాళం వేసి ఉన్న ఇండ్లపై రెక్కీ చేసుకొని రాత్రి వేళల్లో ఇంట్లోకి వెళ్లి దొంగతనాలకు పాల్పడే ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 25 లక్షల రూపాయలు విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు తిరుమల నగర్ శెట్టిపల్లి పంచాయతీలోని డోర్ నెంబర్ 1-54 ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో, రాత్రి వేళ ముందు వేసుకున్న పథకం ప్రకారం ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న బంగారు నగలు, డబ్బులు అపహరించుకుని దొంగలు అక్కడి నుండి పారిపోయారన్నారు. ఈ మేరకు బాధితుడు ఎస్‌వి రవి తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బుధవారం మధ్యాహ్నం మంగళం ఆర్టీవో కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న జి సుధాకర్, పి శేఖర్, గాజులపల్లి శ్రీనివాసుల రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితులు ముగ్గురు కలసి చెడు అలవాట్లుకు అలవాటు పడి, యుక్త వయసు నుండి దొంగతనలు చేయడం మొదలుపెట్టారన్నారు. ఆ క్రమంలో వీరు రాత్రి సమయంలో దొంగతనాలు చేస్తూఒక గ్రూప్ గా ఏర్పడి తిరుచానూరు, తిరుపతి, చంద్రగిరి, తిరుపతి రూరల్ కాలనీలలో తిరుగుతూ రాత్రి సమయంలో ఇంటికి తాళం వేసిన ఇళ్లకు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి ఇంట్లో ఉన్న విలువైన బంగారు, వెండి వస్తువులను, నగదు దొంగిలిస్తున్నారని తెలిపారు. దొంగిలించిన సొత్తులతో విలాస జీవితం గడుపుతున్నారన్నారు. వీరిపై హైదరాబాద్ లోని పలు పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదు కాగా చాలా కేసులలో జైలుకు కూడా వెళ్లారని తెలిపారు. అంతర్ రాష్ట్ర నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుండి సుమారు 20 లక్షల రూపాయల విలువైన 277 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 40 వేలు రూపాయల విలువైన 550 గ్రాముల వెండి ఆభరణాలు, ఏపీ 09-బిసి -0009 నెంబర్ గల ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని రిమాండ్ కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. నిందితుల అరెస్టు సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్, అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీ సునీల్, సీఐ సాయినాథ్, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పాఠశాలల స్థితిగతులపై సమీక్ష

ప్రజాశక్తి -కోట : పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమీక్షించారు. కోట మండలంలోని ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రధానోపాధ్యాయులతో కోట ఎంఈఓ 1 శైలజ, ఎంఈఓ 2 దారా మస్తానయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాల స్థితిగతులు మార్చటం, విద్యార్థుల మధ్యాహ్న భోజనాలు, తాగునీరు, పరిసరాలు సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు ఇవ్వాలని, మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణం ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి భద్రత జీవితానికి రక్ష: ఆర్‌టివో



మాట్లాడుతున్న గూడూరు ఆర్‌టివో కిషోర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 'రహదారి భద్రత మీ జీవితా నికి రక్ష' అని గూడూరు ఆర్టీవో కిషోర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్స వాల లో భాగంగా గూడూరు ఆర్టీవో కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన కల్పించా రు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గూడూరు ఆర్టీవో కిషోర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఎంవిఐ లు సునీల్, జకీర్ , శాంతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం



త్రిశూల స్నానం చేయిస్తున్న ఈవో బాపిరెడ్డి, తదితరులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో బుధవారం త్రిశూల స్నానం ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొద ట ఆలయ వేద పండితు లు స్వామి అమ్మవార్లతో పాటు సుబ్రహ్మణ్య స్వామి, వినాయకు డు, సద్యోమూర్తి విగ్రహాలను స్వర్ణముఖి నది వద్దకు తీసుకువచ్చి విశేష పూజలు చేశారు. అనంతరం విగ్రహాలకు నదిలో త్రిశూల స్నానం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు త్రిశూల స్నాన ఘట్టాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రీ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు మండలంలోని స్వంత పొలం కలిగిన రైతులందరూ రిజిస్ట్రీ పోర్టల్‌లో తమ పేరును నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన వెండోడు, పాలిచెర్ల రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతు రిజిస్ట్రీ ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వెబ్ ల్యాండ్ , పట్టా పొలాలు కలిగిన రైతులను మాత్రమే మాత్రమే నమోదు చేస్తామని, మిగిలిన డి - పట్టా, సి జి ఎఫ్ఎస్ పొలాలకు మలి విడత నమోదుకు వీలు కల్పిస్తారని తెలిపారు .ప్రతి రైతు సేవాకేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యమంలో విఏఏ కె శివ, చక్రి, రైతులు పాల్గొన్నారు.